

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## ప్రస్థానం

"**నేను ఇంట్లోంచి** వెళ్ళిపోతున్నాను" భర్తకి కొద్ది దూరంలో నిలబడి రాధిక చెప్పింది.

పేపర్లో సినిమావార్తలని చదువుతున్న బాలాజీ అడిగాడు.

"ఇంత పొద్దున్నే ఎక్కడికి?"

"నేను నానీని తీసుకుని ఇంట్లోంచి వెళ్ళిపోతున్నాను" రాధిక స్వరం పెంచి చెప్పింది.

బాలాజీ కళ్ళు ఎర్రబడ్డాయి.

"ఎవడితో?"

"మీకు అనవసరం."

"మహారాణిగారికి ఏం ఆగ్రహం వచ్చిందట?" వెటకారంగా అడిగాడు.

"నాకు నచ్చలేదు."

"ఏం నచ్చలేదు?" ఓ బూతు మాట వాడాడు.

తండ్రి పక్కన నేలమీద కూర్చుని పలక మీద రాసుకుంటున్న కొడుకువైపు ఓసారి చూసి చెప్పింది.

"మీ ప్రవర్తన, మీ భాష, మీలో మానవత్వమే లేదు. మృగంతో ఇంక కాపురం చేయలేను."

మరుక్షణం ఆమె చెంప ఛెళ్ళుమంది.

"నోర్మూసుకుని లోపలికి పో. తిండి ఎక్కువై కొవ్వెక్కి తన్నుకుంటున్నావు." అరిచాడు.

ఎప్పటిలా ఆమె కన్నీళ్ళతో లోపలికి వెళ్ళలేదు. చెంప పట్టుకుని అక్కడే నిలబడి శాంతంగా చెప్పింది.

"ఈ పశుత్వమే నాకు నచ్చలేదు. ఏడేళ్ళు సహనంగా భరించా. ఇంక నావల్ల కాదు. నేను ఊహించుకున్న భర్తకాదు మీరు. మీలో సున్నితత్వం, సానుభూతి, క్షమ, మెచ్చుకోలు, సరసం, స్నేహం ఏమీలేవు. నావల్లకాదు. పదిహేనోతారీకుకి

ముప్పై ఏళ్ళొస్తాయి నాకు. నా వయసు వాళ్ళకి చాలామందికి పెళ్ళిళ్ళు కాలేదు. నానీని తీసుకుని వెళ్ళిపోతున్నా. మీకు చెప్పకుండా వెళ్ళొచ్చు కానీ దొంగతనంగా వెళ్ళడానికి అంతకాని పనేమీ చేయడంలేదు నేను."

"వెళ్ళి? అడుక్కుతింటారా?"

"మీ కనవసరం."

"నీకిష్టమైతే నువ్వు పో. నా కొడుకుని మాత్రం ఇవ్వను. నీ చావు నువ్వు చావు. ఇంకోమాట, విడాకులు, భరణం తీసుకోవచ్చనుకుంటున్నావేమో. చస్తే విడాకులివ్వను. నీకు అలీమని ఇవ్వాల్సివస్తే ఉద్యోగం మానేస్తా ఏమనుకుంటున్నావో. ఈ బాలాజీ పగ పాము పగ."

"తెలుసు" మృదువుగా నవ్వింది.

"స్కూల్‌కి వెళ్ళి వీడిని చూడచ్చు అనుకుంటున్నావేమో. నువ్వు నానీని చూసినా మాట్లాడినా బడి మాన్పించి ఇంట్లో తాళం పెట్టి ఆఫీస్‌కి వెళ్తా. నా అంత చెడ్డవాడు మరొకడుండడు గుర్తుంచుకో."

రాధిక ఓసారి కొడుకు వంక చూసింది. వాడు తల్లి తండ్రులని భయంగా చూస్తున్నాడు.

"నానీ! నాన్న దగ్గర జాగ్రత్తగా ఉంటావా?" అడిగింది.

వాడు తలూపి అడిగాడు "ఎన్ని రోజులమ్మా?"

రాధికకి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. వాడి నుదుటి మీద ముద్దుపెట్టుకుని చెప్పింది. "సారీ రా నానీ. మగపిల్లవాడివని మీ నాన్నకి నువ్వంటే అతి ప్రేమ కదా. నిన్ను బానే చూస్తారులే. అల్లరి చేయకు. బుద్ధిగా చదువుకో."

వాడు బిక్క మొహం వేసి చూస్తూండగానే రాధిక లోపలనించి ఓ సూట్ కేస్‌తో వచ్చి చెప్పింది.

"మీరు కొన్నవేమీ తీసుకెళ్ళడంలేదు. మీరిచ్చిన బంగారం బీరువాలో ఉంది."

ఆమె బయటకి నడుస్తూంటే బాలాజీ దిగ్భ్రమగా, నానీ విచారంగా చూస్తుండిపోయారు.

"ఎంత విషాదం? అంటే అప్పటి నించి నిన్ను మీ నాన్న పెంచారా?" లయ సానుభూతిగా అడిగింది.

సిద్ధార్థ మౌనంగా తలూపాడు.

"అప్పటినించి నువ్వు మళ్ళీ మీ అమ్మని చూడలేదా?"

"రెండు మూడుసార్లు కలిసాను. ఇప్పుడామె మీద నాకు పెద్ద ప్రేమలేదు."

"కానీ ఆరేళ్ళ కొడుకుని కూడా వదిలి వెళ్ళింది అంటే మీ మమ్మీ ఎంత బాధపడిందో మీ నాన్నతో. మనం అదికూడా ఆలోచించాలి కదా?" లయ అనునయంగా చెప్పింది.

"మనిషిలాగా సృష్టిలో ఏ జీవి అలా పిల్లల్ని వదిలిపోదు తెలుసా?" సిద్ధార్థ ఉక్రోషంగా చెప్పాడు.

"ఎన్ని జీవుల గురించి చదివావేం? మనిషి బుద్ధిజీవి. మీ అమ్మకి ఎక్కడికి వెళ్తుందో క్లారిటీ లేకపోయినా నిన్ను తీసుకెళ్తానంది. మీ నాన్న నిన్ను ఇవ్వనన్నారు. స్కూల్‌కి వెళ్ళి చూస్తే బడి మాన్పిస్తామన్నారు. నీ ఉద్దేశంలో అప్పుడు మీ అమ్మ కొంగు నోట్లో కుక్కుకుని వంటింట్లోకి నడవాలా? నీకోసం తన జీవితాన్ని, కోరికలని అన్నిటినీ వదిలేసి మీ నాన్నతో బతకాలా? నువ్వు చాలా సెల్ఫిష్ నానీ."

"ఐతే పిల్లల్ని ఎందుకు కనాలి అసలు?"

లయ పకపక నవ్వింది.

"చాలా ఓల్డ్ డైలాగ్. ఇరవై మూడేళ్ళ అమ్మాయి భవిష్యత్తులో నా భర్తని వదిలేస్తానేమో, పిల్లలతో ఇబ్బంది. అందుకని అసలు పిల్లలు వద్దులే అని ఆలోచించదు. అంతా చక్కగా సవ్యంగా సాగుతుందనే అనుకుంటుంది. పెళ్ళయిన ఏడాది దాకా మీ నాన్న ఆవిడతో బానే వుండి వుంటారు."

సిద్దార్థ మాట్లాడలేదు.

"మీ నాన్న నిన్ను బానే పెంచారుగా. ఇంక దిగులెందుకు? మీ పిన్నికూడా మంచిదే పాపం"

"ఆవిడకి ఏదో గైనిక్ ప్రాబ్లం. పిల్లలు పుట్టలేదు. మనసులో ప్రేమున్నా లేకపోయినా నాన్నకి భయపడి బానే చూసిందిలే."

లయ అతన్ని దీర్ఘంగా చూసి చెప్పింది.

"నీకు ఎవరి మీదా నమ్మకం లేదు. మీ నాన్న పోలికనుకుంటా."

సిద్దార్థ ఉక్రోషంగా చూసాడు.

"సరేకాని సినిమాల్లోలా మీ నాన్న రెండో భార్య కొంగుపట్టుకుని తిరగలేదా?" లయ ఆసక్తిగా అడిగింది.

"లేదు. పిన్నికి నాన్నంటే చచ్చేంత భయం." ఓ నిమిషం ఆగి చెప్పాడు.

"కాకపోతే అమ్మని కొట్టినట్లు పిన్నిని ఎప్పుడూ కొట్టలేదు."

లయ మౌనంగా ఉండిపోయింది.

"ఐనా ఇప్పుడు మా అమ్మని కలవాలని నీకెందుకు అనిపించింది?" అడిగాడు.

"కలిసినా మీ నాన్న ఇంట్లో పెట్టి తాళం వేయలేరుగా?" నవ్వింది.

"సీరియస్‌గా అడుగుతున్నాను చెప్పు. నిన్ను పెళ్ళి చేసుకోవాలంటే ముందు మా అమ్మని కలవాలని ఎందుకన్నావ్?"

"చెప్తాను నానీ. మన ప్రయాణం ముగిసి తిరిగి ఇంటికి చేరేలోగా చెప్తాను. ముందు నువ్వు చెప్పు. మీ అమ్మ వెళ్ళాక మీ నాన్న ఏం చేసారు?"

"మా అమ్మని బూతులు తిట్టారు. తర్వాత మా నాయనమ్మకి ఫోన్ చేసి అర్జెంట్‌గా రమ్మని చెప్పారు. మా మామయ్యకి, అదే అమ్మ తమ్ముడికి ఫోన్ చేసి తిట్టారు. అతనేమో 'మీరు మా అక్కనేదో చేసి నాటకం ఆడుతున్నారు, పోలీస్ రిపోర్ట్ ఇస్తా' అని తిరిగి అరిచాడు. అమ్మకి పేరెంట్స్ లేరు. నీ మామ దగ్గరకి కూడా పోలేదట్రా నానీ. మీ అమ్మ ఎక్కడికి పోయిందో. రేపు పేపర్లో తెలుస్తుందిలే' అన్నారు. నాయనమ్మ సాయంత్రానికల్లా వచ్చింది. నన్ను పట్టుకుని ఏడ్చింది. 'నీ కోపం కొంప ముంచుతుంది తగ్గరా' అని ఎన్నిసార్లు చెప్పానా పెద్దాడా అని నాన్నని తిట్టింది.

మా అమ్మ ఎప్పుడూ స్కూల్‌కి రాలేదు. రోజు నాన్న ఆఫీస్ నించి వచ్చాకడిగేవారు 'మీ అమ్మ వచ్చిందా బడికి?' అని. కొన్నిరోజుల తర్వాత మా అమ్మ ఫ్రెండ్ నీరజ ఆంటీ హస్బెండ్ అనిల్ అంకుల్ నన్ను కలవడానికి స్కూల్‌కి వచ్చాడు. ఆయనకి నేనంటే చాలా ప్రేమ. 'ఏరా నానీ ఎలా ఉన్నావ్?' అని అడిగాడు. నేను ఆయన్ని గట్టిగా పట్టుకుని ఏడ్చాను. ఆయన నా తల నిమురుతూ ఉండిపోయాడు. తర్వాత నుదుటిమీద ముద్దుపెట్టుకుని 'సారీ రా నానీ' అన్నాడు. 'చిన్నపిల్లవాడివి నీకు అబద్ధం చెప్పమని చెప్పకూడదు. కానీ నేను నిన్ను కలిసానని మీ నాన్నకి చెప్పకు' అన్నాడు. ఆ తర్వాత ఆయన నాలుగైదు సార్లు వచ్చి నన్ను కలిసాడు"

సిద్దార్థ మొహం ఎర్రబడింది. ఓ క్షణం తటపటాయించి చెప్పాడు.

"ఓసారి మామయ్య స్కూల్‌కి వచ్చాడు. నన్ను ఎత్తుకుని అడిగాడు. "నానీ అమ్మ దగ్గరకి వెళ్దాం వస్తావా?"

నేను ఆనందంగా తలాడించేలోగా చెప్పాడు. 'మీ అమ్మ అనిల్‌ని పెళ్ళిచేసుకుంది. వాళ్ళు నిన్ను తీసుకురమ్మన్నారు. వెళ్దామా?' నాకు కోపం వచ్చింది. అంకుల్ అన్నిసార్లు వచ్చినా నాకు ఆ సంగతి చెప్పలేదు. మా నాన్న మీద చాలా జాలేసింది. ఆ వయసులో అది జాలి అని నాకు తెలీదుకానీ ఆయనకి అన్యాయం జరిగిందనిపించింది. 'నేను రాను. నాకోసం అనిల్ అంకుల్ కానీ, నువ్వుకానీ వస్తే మా నాన్నకి చెప్తా' అని పెద్దగా అరిచి క్లాస్ రూంలోకి వెళ్ళిపోయా."

లయ సానుభూతిగా అతని చేతిని తన చేతిలోకి తీసుకుంది.

"ఆరేళ్ళ కుర్రాడికి ఇది ఎంత బాధాకరమో నాకు తెలుసు. తర్వాత?"

"నాన్నకి కూడా తెలిసిందనుకుంటా. ట్రాన్స్‌ఫర్ అడిగి ఆ ఊరు నించి చాలాదూరం ఊరుకి తెచ్చేసాడు. మళ్ళీ ఆ ఊరు వెళ్ళలేదు" సిద్దార్థ అలసటగా ఆమె భుజం మీద తలాన్చాడు.

"మరి మీ అమ్మని ఎప్పుడు చూసావు?"

"మా నాయనమ్మ పోయినప్పుడు. చుట్టాలంతా గుసగుసలాడుకుంటున్నారు. రాధిక వచ్చిందని. అప్పటికి నాకు పదిహేను, పదహారేళ్ళుంటాయ్. బయటకి వెళ్ళి చూసా. అమ్మ కనిపించింది. మా బాబాయ్‌తో మాట్లాడుతోంది. ఇంతలో నాన్న బయటకి వచ్చారు. అమ్మ వెంటనే వెళ్ళిపోయింది. తర్వాత బాబాయ్ చెప్పాడు, నాయనమ్మకి అమ్మంటే ఇష్టంట. నాన్నని తిట్టి అమ్మనే సపోర్ట్ చేసేదట. ఆ తర్వాత రీసెంట్‌గా, నాలుగైదేళ్ళక్రితం మా బాబాయ్ కూతురు పెళ్ళికి వచ్చింది. నన్ను పలకరించాలని నా దగ్గరకి వచ్చింది కానీ నేను మాట్లాడలేదు."

"అయ్యో! అలా ఎందుకు చేసావు? మాట్లాడాల్సింది" లయ చెప్పింది.

"నాకు ఆవిడతో మాట్లాడాలని లేదు. ఇప్పుడైనా నువ్వు పెళ్ళికి ముడిపెట్టావని వస్తున్నాను. లేకపోతేనా...."

"ఓకే. ఓకే. మిగిలిన కథ మీ అమ్మ దగ్గర విందాం" లయ అతన్ని అనునయంగా తట్టింది.

కొచ్చిన్ ఏర్‌పోర్ట్‌లోంచి బయటకి వచ్చాక సిద్దార్థ ఓ టేక్సీ అతనికి ఫోన్‌లోని అడ్రస్ చూపించాడు. అతను దాన్ని చదివి తలాడించి టేక్సీ వెనక తలుపు తీసాడు. వారు కేబ్‌లో కూర్చున్నాక సూట్‌కేసులని డిక్కీలో పెట్టి తలుపు మూసి డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు. రెండు గంటల తర్వాత టేక్సీ ఓ గ్రామంలోకి ప్రవేశించింది. డ్రైవర్ వెనక్కి తిరిగి ఫోన్ అడిగి అడ్రస్‌ని ఓసారి చూసి ఓ ఇంటిముందు ఆపాడు.

"అబ్బ! ఈ ఊరు ఎంత బావుంది నానీ? నిజంగా కేరళ గాడ్స్ ఓన్ కంట్రీనే" లయ చుట్టూ చూస్తూ చెప్పింది.

లగేజ్‌ని బయటపెట్టి డబ్బు తీసుకుని టేక్సీ డ్రైవర్ కేబ్‌ని రివర్స్ చేసి వెళ్ళిపోయాడు.

కేరళ స్టైల్‌లో ఎక్కువ చెక్కలని ఉపయోగించి కట్టిన ఇంటిని చూసి లయ చెప్పింది.

"ఇదే ఇల్లనుకుంటా. పద."

సిద్దార్థ మొహంలో అయిష్టం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. వంగి సూట్ కేస్ అందుకుని లయవైపు చూస్తూ అడిగాడు.

"తప్పదంటావా? మన పెళ్ళికి దీనికి సంబంధం ఏమిటి?"

లయ అతని మాట విననట్లుగా తన బేగ్ తీసుకుని గేట్ లేని ఆ ఇంటి ఆవరణలోకి నడిచింది. ఇంటిముందు వరండాలో పేము కుర్చీలున్నాయి. ఆవరణంతా పూలమొక్కలు, వాటి మధ్యలో సిమెంట్ బెంచ్ ఉన్నాయి.

ఐదుమెట్లెక్కి వరండాలో ఉన్న విండ్ ఛైమ్స్‌ని చిటికె వేసి మోగించి ఇంటి తలుపుని ఉత్సాహంగా తట్టింది.

పావు నిమిషం తర్వాత తలుపు ఓరగా తెరుచుకుంది. ఏభై ఏళ్ళతను లయని చూసి అడిగాడు.

"యస్?"

"మీరు అనిల్?"

"అవును మీరు?" అతను ఆశ్చర్యంగా అడిగాడు.

అంతలో అతని దృష్టి దూరంగా నిలబడివున్న సిద్ధార్ధ మీద పడింది.

"అరేయ్ నానీ? ఎన్నాళ్ళకి? వాటే సర్ ప్రైజ్? రాధీ అర్జెంట్‌గా రా. రారా లోపలికి. అలా నిలబడిపోయావే?" అతను ఉద్వేగంగా అరిచాడు.

లయ అతన్ని తప్పుకుని లోపలికి వచ్చింది. అనిల్ వెళ్ళి సిద్ధార్ధని ఆలింగనం చేసుకుని తీసుకుని వచ్చాడు. హడావిడికి బయటకి వచ్చిన రాధిక కొడుకుని చూసి నిర్ఘాంతపోయింది.

"హలో అమ్మా" సిద్ధార్ధ మొహమాటంగా చెప్పాడు.

"నానీ ఎలా వున్నావు? జాబ్ ఎలా ఉంది?" రాధిక అతని చెయ్యి పట్టుకుని అడిగింది.

"బానే ఉన్నాను." అతను చెయ్యి విడిపించుకున్నాడు.

"ఈ అమ్మాయి లయ కదా? చక్కగా ఉంది" రాధిక మెచ్చుకుంది.

"థాంక్స్ ఆంటీ. కానీ మీ కన్నా కాదు. ఈ ఏజ్‌లో మీరిద్దరూ ఎంత బాగున్నారో. అంకుల్ అయితే మోడల్ అనుకోండి. ఎంత ఫిట్‌గా ఉన్నారో. నానీ సీరియస్లీ నువ్వు కూడా జిమ్‌లో చేరాలి" లయ చెప్పింది.

"ముందు కాఫీ ఇస్తాను. తర్వాత వంట చేస్తాను. మంచినీళ్ళు కావాలా?" అడుగుతూ రాధిక వంటగదివైపు వెళ్ళింది. అనిల్ ఆమెని అనుసరించాడు.

"నానీ చాలా డిజప్పాయింట్ అయ్యా. ఇన్నేళ్ళ తర్వాత కలుసుకున్న తల్లీకొడుకులు కౌగలించుకుని, భోరున ఏడ్చి.. ఈ సీన్స్ ఏవి? అలా ఇంటికి వచ్చిన చుట్టంగా ఉంటావే?" లయ గొంతు తగ్గించి అడిగింది.

"నాకు ఎంబార్సింగ్‌గా ఉంది లయా. నో అంటే ఓ వారం అలిగేదానివేమో. ఇలా ఇన్నేళ్ళ తర్వాత వీళ్ళింటికి రావడం నాకు నచ్చలేదు" సిద్ధార్ధ చిరాగ్గా చెప్పాడు.

"అవునూ. వాళ్ళు నిన్నూ, నన్ను ఎలా గుర్తుపట్టారు?"

"మా బాబాయ్ లేడూ మధ్యలో? మా మామయ్యకూడా. ఈ అడ్రస్ ఇచ్చింది బాబాయే"

"ఓ! అదే అనుకున్నాలే."

రాధిక నాలుగు కప్పుల్లో కాఫీ తెచ్చింది. నలుగురూ కాఫీ తాగుతూంటే అనిల్ అన్నాడు.

"గ్లాడ్ రా నానీ. నువ్వు పెళ్ళి చేసుకోబోయే అమ్మాయిని మీ అమ్మకి చూపించడానికైనా ఇన్నేళ్ళకి మనింటికి వచ్చావ్."

సిద్ధార్ధ మొహం ఎర్రబడింది. లయ మొహమాటంగా నవ్వింది. రాధిక లేచి చెప్పింది.

"మీరు కబుర్లు చెప్పుకుంటూండండి. వంట చేస్తాను."

"నేనూ వస్తానాంటీ" లయ ఆమె వెనక నడిచింది.

రాధిక బంగాళదుంపలని తీసి చెప్పింది.

"పొటాటో ఫ్రై వుంటే చాలు నానీకి. ఇంక ఏమీ తినేవాడు కాదు. పెద్దయ్యాడుగా టేస్ట్‌లు మారిపోయి వుంటాయి. వాడికేమిష్టం? నీకేం ఇష్టం?"

"ఏదైనా పర్లేదు ఆంటీ. హైద్రాబాద్‌లో హెవీ బ్రేక్‌ఫాస్ట్ చేసే బయలుదేరాం.

నానీకి సాంబార్ కూడా చాలా ఇష్టం. నేను అన్నీ తింటాను" లయ చెప్పింది.

రాధిక తన వివరాలు అడుగుతుందనుకుంది కానీ అడగలేదు. అలాగే నానీ సంగతులు కూడా అడగలేదు. లయ కొంచెం నిరాశపడింది.

రెండు నిమిషాలుండి బయటకి వచ్చేసింది. అనిల్ ఏవో మామూలు విషయాలు మాట్లాడుతున్నాడు. పది నిమిషాల తర్వాత అతను లేచి వంటగదిలోకి వెళ్ళాడు.

"అంకుల్‌కి నీ మీదున్న ప్రేమ అలాగే ఉంది నానీ. ఎంత ఆప్యాయంగా ఉన్నారో" లయ చెప్పింది.

సిద్ధార్థ ఏమీ మాట్లాడలేదు.

వంటగదిలోంచి మాటలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి. రాధిక ఎందుకో పెద్దగా నవ్వుతోంది. ఆ నవ్వు వంటగదిని దాటి హాల్లోకి వ్యాపించి లయ పెదవుల మీదకి కూడా నవ్వుని తెప్పించింది.

"భలే నవ్వుతున్నారు ఆంటీ. నువ్వెప్పుడూ ఇలా మనసు విప్పి జలతరంగిణిలా నవ్వలేదు" చెప్పింది.

"అమ్మ ఇంత నవ్వడం నాకూ తెలీదు."

"ఓ! మీ ఇంట్లో ఉంటే హాయిగా నవ్వడానికి వీల్లేదేమో?" లయ నవ్వింది.

"మనం కొచ్చిన్ వెళ్ళిపోయి హోటల్‌లో ఉండి, రేపు ఫ్లైట్‌కి వెళ్ళిపోదామా?" సిద్ధార్థ అడిగాడు.

"మనం వచ్చి గంటకూడా కాలేదు. నేను ఆంటీని చూడడానికి రాలేదు. నాకు కొన్ని సందేహాలున్నాయి. తీర్చుకోడానికి వచ్చాను. రేపే హైద్రాబాద్ వెళ్దాం కాని అప్పటిదాకా ఇక్కడే ఉంటున్నాం" లయ చెప్పింది.

"మైగాడ్! లయా ప్రేమని అడ్డుపెట్టుకుని ఇష్టంలేని పనులు చేయిస్తున్నావు" నిస్సహాయంగా చెప్పాడు.

"అవునూ. వీళ్ళిద్దరికీ పిల్లలున్నారా? ఐ మీన్ నీకు హాఫ్ బ్రదర్స్, సిస్టర్స్?" లయ కుతూహలంగా అడిగింది.

సిద్ధార్థ విసురుగా లేచి నుంచున్నాడు.

"సరే. సరే. వదిలెయ్. నేను ఆంటీని అడుగుతాలే" లయ అతన్ని కూర్చోపెట్టింది.

కొద్దిసేపటికి అనిల్ డైనింగ్ టేబుల్ మీద పాత్రలని పెట్టడం గమనించి లయ వెళ్ళి చెప్పింది.

"మీరు కూర్చోండి అంకుల్. నేను చేస్తాను."

"ఇది నా డ్యూటీ అమ్మా. రోజూ ఇది నా పనే. మీరొచ్చారని హెల్ప్ చేయడం కాదు" అనిల్ నవ్వాడు.

నాలుగు ప్లేట్లు, మంచినీళ్ళ గ్లాసులు పెట్టి పిలిచాడు.

"రారా నానీ. తినేద్దాం."

పొటాటో ఫ్రై సిద్ధార్థలో ఏవో జ్ఞాపకాలని గుర్తుచేసింది. మౌనంగా తిన్నాడు. దాదాపు ఇరవై ఏళ్ళ తర్వాత అమ్మ చేతివంట.

"ఆంటీ. మీతో మాట్లాడాలి" భోజనాలయ్యాక లయ నెమ్మదిగా చెప్పింది.

"అలాగే. పద" ఆమె మెట్లెక్కుతూ అనిల్‌తో చెప్పింది.

"నానీకి మన గార్డెన్ చూపించు. లక్కీగా వెదర్ బాగుంది."

పైన హాల్‌లో పాతకాలంనాటి చెక్కసోఫాలు ఉన్నాయి.

"ఇక్కడ కూర్చుందాం ఆంటీ. బాగుంది" లయ చెప్పింది.

"సరే. చెప్పు ఏం మాట్లాడాలి?" రాధిక దిండుని ఒళ్ళో పెట్టుకుని అడిగింది.

"మీరు నానీని, ఆరేడేళ్ళ చిన్నబాబుని వదిలేసి వెళ్ళిపోయేంత దుర్మార్గుడా వాళ్ళ డేడీ?"

"ఈ ప్రశ్నకి, నానీతో నీ పెళ్ళికి సంబంధం ఉందా?"

"ఉంది కదా! నానీకి తండ్రి పోలికే వచ్చిందనుకోండి. రేపు నేనూ మీలాగే చేయాలేమో?"

రాధిక నవ్వింది "టూ లేట్ అనుకుంటాను. ప్రేమలో ఇంత దూరం వచ్చాక వదిలేయడం కష్టం కదూ?"

"మీరు పెళ్ళయిన ఏడేళ్ళకి వదిలేయలేదా?"

"నాది ప్రేమ పెళ్ళికాదు"

రాధిక ఓ నిమిషం నిశ్శబ్ధంగా ఉండిపోయింది. నోరు జారినందుకు లయ సిగ్గుపడిపోయింది.

"సారీ ఆంటీ" గొణిగింది.

బాలాజీ ఎప్పుడూ ఆనందంగా లేడు. ఎదుటివారిని ఆనందంగా ఉంచడం కూడా తెలీదు. ఆయనకి విపరీతమైన అహం. టీనేజ్ అమ్మాయిగా నేను పెళ్ళి భర్త గురించి చాలా కలలు కన్నాను. వాటికి వ్యతిరేక మనస్థత్వం బాలాజీది. 'ఇలా ఉండటం తప్పు. ఆ అమ్మాయిని హింసపెట్టకు' అని వాళ్ళమ్మ వచ్చినప్పుడల్లా చెప్పేది. అతని చెడ్డతనం గురించి ఇది చాలు.

నీకు నీరజ గురించి చెప్పాలి. తను నా బెస్ట్ ఫ్రెండ్ అనిల్‌ని ప్రేమించింది. కులాలే కాదు. మతాలు కూడా వేరవటంతో ఇద్దరి పేరెంట్స్ ఒప్పుకోలేదు. రిజిస్టర్ మేరేజ్ చేసుకుని మా ఇంటి పక్కన కాపురం పెట్టారు. అనిల్ మర్చంట్ నేవీలో పనిచేసేవాడు. కాంట్రాక్ట్ ఉన్నప్పుడు సంవత్సరానికి నాలుగైదు నెలలు షిప్‌లో వెళ్ళి మిగిలిన సమయమంతా ఇంట్లోనే ఉండేవాడు. నా ఊహల్లో నేను ఎలా ఉండాలనుకున్నానో వాళ్ళు అలా ఉండేవాళ్ళు. నీరజ మీద అసూయ కలగలేదు కాని నా జీవితం మీద చాలా అసంతృప్తి కలిగింది.

"దురదృష్టవశాత్తూ నీరజకి కేన్సర్ వచ్చింది. ముగ్గురం తల్లడిల్లిపోయాం. ఆ రోజుల్లో హెల్త్ ఇన్సూరెన్స్‌ల్లాంటివి లేవు. కాంట్రాక్ట్ బేసిస్‌న పనిచేసే అనిల్‌కి కంపెనీ ఇన్సూరెన్స్ ఉందికాని భార్యకి లేదు. కేన్సర్ బాధాకరమైన జబ్బు మాత్రమేకాదు. ఖరీదైన జబ్బుకూడా. వైద్యం కోసం అనిల్ కాంట్రాక్ట్ దొరికినప్పుడల్లా వెళ్ళేవాడు. ఆ సమయంలో నేను నీరజకి తోడుగా ఉండేదాన్ని. దాదాపు రెండేళ్ళు బాధపడ్డాక నీరజ పోయింది. ముందే ఊహించిన విషయమే ఐనా నాకే ఎంతో వెలితిగా అనిపించింది. ఇంక అనిల్ సంగతి చెప్పక్కర్లేదు. చాలా దిగులు పడ్డాడు. దాదాపు ఏడాది తర్వాత నాకు ఫోన్ చేసాడు.

' నీరజని మర్చిపోలేకపోతున్నా. మీరు నాకు తోడుగా ఉంటారా?' ఊహించని ఆ ప్రతిపాదనకి షాక్ అయ్యాను. అసంకల్పితంగా ఫోన్ పెట్టేసాను. ఆ తర్వాత ఆ విషయం గురించి పదే పదే ఆలోచించాను. బహుశా అనిల్ నన్ను అడగపోతే బాలాజీతో రాజీపడి అలాగే బతికేదాన్నేమో. కానీ నాకో అవకాశం వచ్చింది. ఇంకొన్ని నెలల్లో నాకు ముప్పై ఏళ్ళొస్తాయి. నిండు యవ్వనం. ఇంకా డెబ్బై ఏళ్ళ జీవితం ముందుంది. ఈ కాలమంతా ముద్దూ ముచ్చట లేకుండా ఇలా ఒక సోఫా, ఓ టీపాయ్‌లా గడిపేయాలా అనిపించింది. అనిల్ నీరజని ఎంత ప్రేమగా చూసుకునేవాడో నాకు తెలుసు. నన్ను

అందులో సగం చూసుకున్నా చాలు అనిపించింది. ముందు భవిష్యత్తు రంగుల్లో కనిపించింది. మిలమిల మెరుస్తూ'' రాధిక ఒక నిముషం ఆగింది.

''నాకు పేరెంట్స్ లేరు. ఒకే తమ్ముడు. ఓ రోజు వాడిని రమ్మని అనిల్ గురించి చెప్పాను. బాలాజీ అంటే విపరీతమైన కోపం ఉన్న నా తమ్ముడు 'బెస్ట్ అక్కా. అనిల్ మంచివాడు. వెళ్ళిపో. అతనితో వెళ్ళిపోయి పెళ్ళిచేసుకో' అన్నాడు. నా తమ్ముడు ఒప్పుకున్నాడు. ఇంక సొసైటీ ఏమనుకున్నా నాకు అనవసరం అనుకున్నా. అనిల్‌కి నా అంగీకారం చెప్పాను. నాతోపాటు నానీనికూడా ఆహ్వానించాలని చెప్పాను. ఆనందంగా ఒప్పుకున్నాడు.

కానీ నేనేం తప్పు చేయట్లేదు అనిపించి ఆయనకి చెప్పే బయటకి వచ్చాను. కానీ నానీని ఇవ్వనన్నారు. అంత నిర్ణయం తీసుకుని వాడికోసం ఇంట్లో ఉండిపోతే తర్వాత నా పరిస్థితి ఏమిటో నాకు తెలుసు. అందుకే వాడు లేకుండానే బయటకి వచ్చేసాను'' రాధిక దీర్ఘంగా నిట్టూర్చింది.

లయ సానుభూతిగా చూసింది.

''వాడికి ఊహ తెలిస్తే 'అమ్మా' అంటూ వాడే వస్తాడని అనిల్, నా తమ్ముడు నన్ను ఓదార్చారు. కానీ వాడు ఎందుకో నా మీద కోపం పెంచుకున్నాడు. సహజమేకదా? బాలాజీ విడాకులు ఇవ్వనన్నాడు. అతను గుళ్ళో, మేము చర్చ్‌లో పెళ్ళిచేసుకున్నాం. తర్వాత అనిల్‌తో ఇక్కడికి వచ్చేసాను. కానీ లయా ఇరవై ఏళ్ళ క్రితం నేను ఆ నిర్ణయం తీసుకుని బయటకి వచ్చినందుకు నాకు రిగ్రేట్ లేదు. నేను చాలా ఆనందంగా ఉన్నా. 'మంచి నిర్ణయం తీసుకున్నాను. పతివ్రతలాగా ఆలోచించి 'నో' అని ఉంటే ఈ స్వర్గం ఉండేది కాదు కదా అని భయపడుతూంటాను.''

లయ సంతోషంగా నవ్వింది.

''పురాణాల ఉదాహరణలు చెప్పనుకాని తండ్రి చెడ్డవాడైతే కొడుకు చెడ్డవాడవ్వాలని లేదు. మా బ్రదర్ చైన్ స్మోకర్. వాడి కొడుకులు సిగరెట్‌కి ఆమడదూరంలో ఉంటారు. అలాగే నువ్వు వాడితో బావుంటే నా చపలత్వం కూడా రాదులే'' రాధిక నవ్వింది.

''అయ్యో! అలా అనకండి ఆంటీ'' లయ నొచ్చుకుంది.

''లయా! టీనా? కాఫీనా?''

కిందనించి అనిల్ అరుపు వినిపించింది.

''కాఫీ. వచ్చేస్తున్నాం. మీరు రానక్కర్లేదు'' చెప్పి లయ మెట్ల దగ్గరకి వెళ్ళి ఓ క్షణం సందేహంగా ఆగి రాధికని అడిగింది.

''మీ అబ్బాయితో ఎందుకంత కోల్డ్‌గా ఉన్నారాంటీ? కనీసం హగ్ చేసుకోలేదు. ఆ ప్రేమని ఇంకొకరికి ఇచ్చేసారా అనుకుంటే మీకు వేరే పిల్లలు లేరు. మరి నానీతో బావుండచ్చుగా?''

''ఏమో లయా! బహుశా నేను మంచి తల్లిని కాదేమో. వాడు చాలా అయిష్టంగా వచ్చాడని తెలిసిపోతుంది. చాక్లెట్ ఇచ్చి ముద్దు చేయడానికి చిన్నపిల్లవాడు కాదు. ఉద్యోగం చేస్తున్నాడు. ఒకమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకోబోతున్నాడు. వాడికి నాకు ఏం మాటలుంటాయి చెప్పు? ఒకరి అభిరుచి ఒకరికి తెలీదు. వాళ్ళ నాన్న గురించి, పిన్ని గురించి నేను అడగను. తన స్కూల్, కాలేజ్, జాబ్ వేశేషాలు చెప్పడానికి వాడు సిద్ధంగా లేడు. అనిల్‌ది అందరితోనూ చనువుగా మాట్లాడే మనస్థత్వం కనక ఆ మాత్రం మాట్లాడుతున్నాడు'' రాధిక కూడా లేచింది.

లయ ఆమెని వెనకనించి కౌగలించుకుని చెప్పింది.

"ఆంటీ! నేను మిమ్మల్ని జడ్జ్ చేయలేను కానీ మీరు చాలా ధైర్యం ఉన్న మంచి ఆంటీ"

"ఇప్పుడు చెప్పు. ఎందుకు పెళ్ళి ముందు మా అమ్మని చూడాలన్నావు?" ఫ్లైట్‌లో కూర్చున్న సిద్ధార్థ అడిగాడు.

"నానీ అంత మంచబ్బాయిని, అందగాడిని కన్నతల్లిని చూడాలని" లయ నవ్వింది.

"ఫోటో చూస్తే సరిపోయేది."

"నానీ! ఆ ఊరునించి వచ్చేప్పుడు దారిలో రెండుగంటలపాటు నేను ఆంటీతో ఏం మాట్లాడానో చెప్పాను కదా! ఇప్పటికైనా మీ అమ్మ మీద కోపం తగ్గిందా?" లయ లాలనగా అడిగింది.

"లేదు. నాకు నచ్చలేదు. ఇప్పటికీ ఆవిడ నిర్ణయం నాకు నచ్చలేదు. పాపం మా నాన్న ఎంత అవమానపడ్డారో నాకు తెలుసు. మా అమ్మకి వ్యామోహం ఎక్కువ. కొంచెం సహనంగా ఉంటే నాన్న మారేవారేమో. నీకు ముందే చెప్తున్నా మన పెళ్ళికి ఆవిడ్ని పిలిస్తే నేను పెళ్ళిచేసుకోను" సిద్ధార్థ ఆవేశంగా అరిచాడు.

లయ ఆలోచనలో పడింది.

Click here to share your comments

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*